క్లుప్తంగా

నేడు మండల సమావేశం

సీతంపేట: మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.గీతాంజలి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వైటీసీలో ఈ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అధికారులు, సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని కోరారు.

నిరుద్యోగులకు శిక్షణ

సీతంపేట: మిలీనియం సాఫ్ట్వేర్ సొల్యూషన్స్లో నిరుద్యోగులకు ఉచిత భోజనం, వసతితో కూడిన శిక్షణ స్థానిక వైటీసీలో ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ కె.గీతాంజలి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్, డిగ్రీ ఆపైన చదివిన వారికి నాలుగు నెలల పాటు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు సీతంపేటలో ఉన్న స్కిల్ కళాశాలను సంప్రదించాలన్నారు.

గంగాపురంలో పశువైద్య శిబిరం



పశువులకు వైద్య సేవలందిస్తున్న పశు వైద్యాధికారి భోగి చక్రధర్

పార్వతీపురంటౌన్: మండల పరిధిలోని గంగాపురం గ్రామంలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు పశు వైద్యాధికారి భోగి చక్రధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు లేగ దూడలకు క్రమం తప్పకుండా నట్టల నివారణ మందు తాగించాలని సూచించారు. ఈ శిబిరంలో 36 పాడిపశువులకు సాధారణ చికిత్స, 13 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స, 11 పశువులకు గర్భ నిర్ధారణ పరీక్షలు, 228 పశువులు దూడలు గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాగించారు. ఈ శిబిరంలో పశు వైద్య ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీడి ప్రాసెసింగ్ యూనిట్లకు స్థల పరిశీలన



స్థల పరిశీలనలో ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పట్టణంలో జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు స్థలాన్ని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ బుధవారం పరిశీలించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆర్టికల్ 275(1) కింద కేంద్ర ప్రభుత్వం నిధులతో రెండు జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్లు పార్వతీపురం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థకు మంజూరు చేసిన సంగతి విదితమే. అందులో భాగంగా పార్వతీపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదాముల్లో జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు గల అనుకూల పరిస్థితులను పీఓ పరిశీలించారు. ఈ పర్యటనలో ఐటీడీఏ ఏపీఓ ఎ.మురళీధర్, డీఆర్డీఏ పథక సంచాలకుడు వై.సత్యంనాయుడు, జీసీసీ డీఎం, ఎ.డి మార్కెటింగ్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తదితరులు పాల్గొన్నారు.

108 సిబ్బందికి శిక్షణ

పార్వతీపురంటౌన్: 108 వాహనంలో ప్రజలకు ఏ ఇబ్బంది కలగ కుండా సిబ్బందికి శిక్షణ అందజేసినట్లు జిల్లా మేనేజర్ మన్మథ నాయుడు తెలిపారు. ఈ మేరకు బుధవారం జిల్లా ఆస్పత్రిలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నా మన్నారు. అపస్మారక, గుండె ఆగిపోయే పరిస్థితుల్లో ఉన్నవారికి సీపీఆర్ చేసి ప్రాణాపాయం నుంచి రక్షణ, మానవ శరీర అంతర నిర్మాణాలు విధివిధానాలపై అవగాహన కల్పించామని చెప్పారు. కార్యక్రమంలో గిరిబాబు, డివిజన్ నుంచి 40 మంది ఈఎంటీలు పాల్గొన్నారు.

ఫైలేరియా నివారణ మందు దగ్గరుండి మింగించాలి

బలిజిపేట: వచ్చేనెల 10వ తేదీన మండలంలో అందరికి ఫైలేరియా వ్యాధి నివారణ మాత్రలు దగ్గరుండి వారితో మింగించాలని డీఎంహెచ్ఓ భాస్కరరావు సూచించారు. బలిజిపేట పీహెచ్సీని ఆయన బుధవారం పరిశీలించి అనంతరం ఆశ కార్యకర్తలు, వైద్యాధికారులు, సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఫైలేరియా నివారణకు అవసరమైన మందును ఏ విధంగా పంపిణీ చేయాలి, గ్రామ పెద్దలను సంప్రదించడం, ఎవరికి ఎంతెంత డోస్ పంపిణీ చేయాలి, వారి చేతికి మందు ఇవ్వకుండా ఎలా మింగించాలో శిక్షణలో సూచించారు. ఫైలేరియా నివారణే లక్ష్యంగా పనిచేయాలని తెలియజేశారు. అదేవిధంగా గురువారం ప్రపంచ నిర్లక్ష్య ట్రాపికల్ వ్యాధుల దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారిణి వై.మణి, ప్రోగ్రాం అధికారి వినోద్, వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి, సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

చైర్మన్ పదవి కోసం..

నాటకీయ పరిణామాలు

- నగర పంచాయతీలో గందరగోళం
- చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్
- 3న ఎన్నిక నిర్వహించేదుకు ఏర్పాట్లు
- అయోమయంలో సభ్యులు



నగర పంచాయతీ కార్యాలయం...

పాలకొండ: పాలకొండ నగర పంచాయతీలో ఉత్కంఠ నెలకొంది. కొంతకాలంగా నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో పలు రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రధానంగా నగర పంచాయతీ చైర్పర్సన్ యందవ రాధాకుమారి వ్యక్తిగత కారణాలతో తన పదవికి రాజీనామా చేయడంతో కొత్తగా ఎన్నుకోవాల్సిన చైర్మన్ పదవి కోస పలు నాటకీయ పరిణామాలు జరుగుతున్నాయి. ఇంతలో ఫిబ్రవరి 3న నగర పంచాయతీ చైర్మన్ పదవి కోసం ఎన్నిక నిర్వహించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడంతో మరోమారు ఇక్కడ రాజకీయ పరిస్థితులు వేడెక్కుతున్నాయి. గత నగర పంచాయతీ ఎన్నికల్లో 20 వార్డుల్లో 17 వార్డుల్లో వైఎస్సార్సీపీ అభ్యర్థులు గెలుపొందగా... మూడు వార్డుల్లో టీడీపీ అభ్యర్థులు విజేతలుగా నిలిచారు. చైర్మన్ పదవి ఎస్సీలకు రిజర్వ్ కావడంతో 19వ వార్డు నుంచి వైఎస్సార్సీపీ అభ్యర్థిగా గెలిచిన యందవ రాధాకుమారిని చైర్పర్సన్గా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. వైస్ చైర్మన్గా రౌతు హనుమంతురావును ఎన్నుకున్నారు. అనంతరం వైఎస్సార్సీపీ రెండో వైస్ చైర్మన్ ప్రతిపాదనతో పల్లా ప్రతాప్ను ఎంపిక చేశారు. యందవ రాధాకుమారికి ప్రభుత్వ ఉద్యోగం రావడంతో చైర్పర్సన్ పదవికి రాజీనామా చేశారు. అక్కడ నుంచి ఈ పదవి కోసం పలు నాటకీయాలు జరుగుతున్నాయి. గత నెలలో తాత్కలిక చైర్మన్ ఎంపిక కోసం సభ్యుల అభిప్రాయం లేకుండానే ఇద్దరి వైస్ చైర్మన్ల పేర్లు ప్రభుత్వానికి కమిషనర్ పంపించారు. ఇందులో పల్లా ప్రతాప్ను తాత్కాలిక చైర్మన్గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

త్వరలో ఎన్నిక..

ప్రస్తుతం పూర్తి స్థాయిలో చైర్మన్ ఎంపిక కోసం ఫిబ్రవరి 3న ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఎస్సీ రిజర్వేషన్ ప్రాతిపదికన చైర్మన్ ఎంపిక కావాల్సి ఉంది. పట్టణంలో రెండు వార్డులు ఎస్సీలకు కేటాయించారు. ఇందులో 19వ వార్డు నుంచి గెలుపొందిన రాధాకుమారి రాజీనామా చేశారు. ఇక మిగిలింది 2వ వార్డు నుంచి వైఎస్సార్సీపీ అభ్యర్థి ఆకుల మల్లేశ్వరి ఉన్నారు. ఈమె ఇటీవల టీడీపీలో మంత్రి అచ్చెన్నాయుడు సమక్షంలో చేరారు.

ఎన్నిక నిర్వహించకపోవడంతో ..

వాస్తవానికి నగర పంచాయతీలో 20 వార్డులు ఉండగా రెండు వార్డులు ఎస్సీలకు రిజర్వ్ అయ్యాయి. ఇందులో 19 వార్డు కౌన్సిలర్లు రాజీనామా చేశారు. ఇంతవరకు ఇక్కడ ఎన్నిక నిర్వహించలేదు. 2వ వార్డు నుంచి గెలుపొందిన ఒక్క ఆకుల మల్లేశ్వరి మాత్రమే ఎస్సీ అభ్యర్థిగా ఉన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వైఎస్సార్సీపీ పూర్తి మెజారిటీతో ఉంది. వారి మద్దతు లేకుండా చైర్మన్ ఎంపిక జరిగే పరిస్థితి లేదు. 19వ వార్డులో ఎన్నిక నిర్వహించి చైర్మన్ ఎంపిక చేయాలని సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

ఎన్నిక జరిగేనా....

ఈ నెల 3న చేపట్టనున్న చైర్మన్ ఎన్నిక నిర్వహణపై అనుమానాలు నెలకొన్నాయి. ఉన్న ఒకే అభ్యర్థి ఆకుల మల్లేశ్వరి ఇటీవల టీడీపీలో చేరడమే ఇందుకు కారణం. 20 మంది కౌన్సిలర్లు ఉన్న నగర పంచాయతీ 17 మంది వైఎస్సార్సీపీ అభ్యరులే కావడం.. వీరందరూ ఎన్నికకు హాజరవుతారా, లేదా అన్నది ప్రశ్నగా మారింది.

కోరం లేకపోతే ఎన్నిక జరగదు..



చైర్మన్ ఎన్నికకు సరిపడా కోరం ఉండాలి. కోరం లేనిపక్షంలో ఎన్నిక నిర్వహించడం కుదరదు. కనీసం పది మంది సభ్యులు హాజరైతే ఎన్నిక నిర్వహిస్తాం. సభ్యులందరికీ ఫారం -2 నోటీసులు అందించాం. ఎన్నికకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. – సర్వేశ్వరరావు, కమిషనర్

'కూటమి' మోసం బట్టబయలు

- సూపర్ సిక్స్ లేనట్లే..
- ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి, తదితరులు

పాలకొండ: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై చేస్తున్న మోసం బట్టబయలైందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. పాలకొండలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ...ఎన్నికల హామీలను నెరవేర్చలేమంటూ ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు చెబుతుండడం సిగ్గుచేటన్నారు. హామీలు అమలు చేయమంటే.. సంపద సృష్టి అంటూ ప్రజలను మభ్య పెడుతున్నారంటూ మండిపడ్డారు. తొమ్మిది నెలల పాలనలో చేసిన 1.19 లక్షల కోట్ల రూపాయలు అప్పుతో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, నిరుద్యోగులకు నెలకు మూడు వేల రూపాయల భృతి అందిస్తామని చెప్పిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఉద్యోగాల మాట పక్కన పెడితే ఉన్న ఉద్యోగులను తొలగించడం నిజం కాదా అన్నారు. పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికీ ఏడాదికి రూ. 15 వేలు.. రైతులకు రూ. 20 వేలు.. ఆడపిల్లలకు నెలకు రూ. 1500 ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్తో రెండు సినిమాలు తీస్తే వారికి వందల ఎకరాలు దోచిపెట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. వైద్య విద్య కోసం అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మెడికల్ కళాశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటే.. వానిని వారి అనుయాయులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్న చంద్రబాబు నైజం ప్రజలకు అర్థమవుతోందన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు అండ్ కో సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని, లేనిపక్షంలో ప్రజల తరపున పోరాటం తప్పదని స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ కనపాక సూర్యప్రకాష్రావు, పాలవలస ధవళేశ్వరరావు, లోలుగు విశ్వేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలి : ఎంపీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శెట్టి పద్మావతి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): వ్యక్తుల కోసం వ్యవస్థను, ఇచ్చిపుచ్చుకునే గౌరవ మర్యాదలను మార్చవద్దని, ప్రజాబద్ధంగా ఎన్నుకోబడిన సర్పంచ్లు, ఎంపీటీసీలు ఇతర ప్రజాప్రతినిధులకు కనీస సమాచారం అందజేయాలని కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి అన్నారు. కురుపాం ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో బుధవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో విద్యాశాఖ అధికారి ఎస్.సత్యనారాయణ మాట్లాడుతుండగా ఉదయపురం సర్పంచ్ బి.అరుణకుమారి మాట్లాడుతూ ఉదయపురం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు పక్కా భవనం లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, ప్రతీ సమావేశంలో ఈ సమస్య ప్రస్తావిస్తున్నప్పటికీ పరిష్కారం కావడం లేదన ఆవేదన వ్యక్తం చేశారు. కురుపాం ఎంపీటీసీ సంతోషిని మాట్లాడుతూ కురుపాంలోని ఏపీ ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజనం బాగోలేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. వ్యవసాయాధికారి నాగేశ్వరరావు మాట్లాడుతుండగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ గ్రామస్థాయిలో నిర్వహించే ఏ వ్యవసాయ శాఖ కార్యక్రమాలకు కనీసం సమాచారం ఇవ్వకపోవడం పట్ల ప్రశ్నించారు. గ్రామ స్థాయిలో లైన్మేన్లు సక్రమంగా పని చేయడం లేదని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు తెలియజేసిన సమస్యలను అధికారులు చిత్తశుద్ధితో పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ జి.సుజాత, జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, వైస్ ఎంపీపీ బి.అన్నాజీరావు, ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత విద్యార్థులదే



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పార్వతీపురంటౌన్: రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కె.డేవిడ్ అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం హక్కు కేంద్రం లాగేసిందని, ప్రాథమిక విద్యను కూడా కేంద్రం తన చేతుల్లోకి తీసుకుందన్నారు. ప్రాథమిక విద్యను ముక్కలు చేసిందని చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రాథమిక పాఠశాలలు, మాధ్యమిక పాఠశాలలు మూసేయడానికి చంద్రబాబు ప్రభుత్వం సిద్ధమైందని, బీజేపీ కేంద్ర ప్రభుత్వ నేషనల్ విద్యా విధానంలో భాగమే ఈ కుట్ర అని అన్నారు. రాష్ట్రాలతో నిమిత్తం లేకుండా కేంద్రం ఏకపక్షంగా చేసిన నిర్ణయాలను రాష్ట్రం అమలు చేయడమే ఈ మార్పుల సారాంశమన్నారు. ఇది రాజ్యాంగ వ్యతిరేక చర్యఅని, రాష్ట్రం హక్కును కేంద్రం లాగేసినా ప్రతిఘటించకపోగా అమలు చేయడం చంద్రబాబు బీజేపీతో కలిసి రాష్ట్రానికి ద్రోహం చేయడమేనన్నారు. కార్యక్రమంలో కవి జి.గౌరినాయుడు, అధ్యక్షులు టి.అఖిల్, ఎస్ఎఫ్ఐ మండల నాయకులు సాయి, శారద, రాజేష్, కవిత, సుకన్య పాఠశాల యాజమాన్యం తాతబాబు, రవి కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో రాజకీయ జోక్యం మానుకోవాలి

పార్వతీపురం టౌన్:

విద్యాసంస్థల్లో రాజకీయ జోక్యం మానుకోవాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురంలోని కొత్తవలసలో గల పురపాలక ప్రాథమిక పాఠశాల వద్ద విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పాఠశాల విద్యా కమిటీ వద్దంటున్నప్పటికీ ఎమ్మెల్యే ఒత్తిడికి లొంగి డీఈఓ వంటలమ్మలను తొలగించడం అన్యాయమని, వారి వెనుక రాజకీయ నాయకుల ఒత్తిడే కారణమని, వెంటనే వాటిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలలో 94 మంది విద్యార్థులు ఉంటున్నారని, వారికి శుచి, రుచికి అనుగుణంగా ఆరోగ్యవంతమైన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారని, స్వయంగా తల్లిదండ్రుల కమిటీ, ఉపాధ్యాయులందరూ కూడా గత కమిటీ సమావేశంలో అభినందించుకున్నట్లు మినిట్స్లో కూడా పొందుపరిచారన్నారు. నేడు రాజకీయ నాయకులు వాటికి భిన్నంగా విద్యార్థులకు అంత బాగా భోజనం వండడం చూసి సహించలేక వారికి అనుకూలమైన వారిని నియమించాలని విద్యాశాఖలో డీఈఓ నుంచి కింద నున్న ఉపాధ్యాయుల వరకు ఒత్తిడి తీసుకురావడం సరైన చర్య కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.రమణారావు, వై.మన్మథరావు, సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లి.వెంకటరమణ, విద్యార్థులు వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



● వితరణ

భామిని మండలంలోని నులకజోడుకు చెందిన కర్రి ఢిల్లీశ్వరరావు రూ. 1.50 లక్షలతో ఓ ఇంటి స్థలం కొనుగోలు చేసి సంబంధిత పత్రాలను అదే గ్రామానికి చెందిన నిరుపేద కోరాడ అప్పారావు దంపతులకు బుధవారం అందజేశారు. ఇదే స్థలంలో పక్కా గృహం నిర్మాణానికి కూడా సహకరిస్తానని ఢిల్లీశ్వరరావు హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు అతడ్ని అభినందించారు. – భామిని

విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా పరీక్షల ప్రత్యేకాధికారి వై.నాగేశ్వరరావు

జియ్యమ్మవలస: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలని జిల్లా జూనియర్ కళాశాలల పరీక్షల ప్రత్యేకాధికారి వై.నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సవరపు రమణ ఆధ్వర్యంలో ఫేర్వెల్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సేవాదృక్పథం కలిగి ఉండాలన్నారు. విద్యార్థులంతా ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. ప్రిన్సిపాల్ రమణ మాట్లాడుతూ ఇంటర్లో మంచి మార్కులు సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కురుపాం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఉషారాణి, అధ్యాపకులు వీకేజీ మహరాణా, శివప్రసాద్, సతీష్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పెన్షనర్లకు తక్షణమే లైఫ్ సర్టిఫికెట్లు



పెన్షనర్ ఇంటికి వెళ్లి లైఫ్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేస్తున్న కురుపాం ఎస్టీఓ శంకరరావు

గుమ్మలక్ష్మీపురం: పెన్షనర్లకు తక్షణమే లైఫ్ సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు కురుపాం ఎస్టీఓ శంకరరావు పేర్కొన్నారు. ఈ మేరకు గుమ్మలక్ష్మీపురం వర్తక సంఘం భవనంలో మండల పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం లైఫ్ సర్టిఫికెట్ల మంజూరు కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్లో గుమ్మలక్ష్మీపురం గ్రామంతో పాటు ఎల్విన్పేట, ఇరిడి గ్రామాలకు చెందిన వంద మందికి లైఫ్ సర్టిఫికెట్లను ఎస్టీఓ అందజేశారు. అలాగే మంచంపై నుంచి లేవలేని పెన్షనర్లు, వృద్ధులైన్ల పెన్షనర్ల ఇంటి వద్దకే వెళ్లి లైఫ్ సర్టిఫికెట్లను అందజేశారు. ఎస్టీఓ సేవలను పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి రథో, చలపతి, నాగు, తిరుపతి తదితరులు కొనియాడి కృతజ్ఞతలు తెలిపారు.

ఖైదీల్లో పరివర్తన అవసరం



ఖైదీలకు సూచనలు అందిస్తున్న సన్యాసినాయుడు

పాలకొండ: ఖైదీల్లో పరివర్తన అవసరమని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ఆర్. సన్యాసినాయుడు అన్నారు. బుధవారం స్థానిక సబ్ జైల్లో ఖైదీలకు పరివర్తన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జైలు జీవితం గడిపిన వారు బయకు వచ్చిన తర్వాత మంచి అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు. జైలులో ఉన్న రోజుల్లో మంచిగా ఉండడపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఆయనతో పాటు జైలు సూపరింటెండెంట్ జోగులు ఉన్నారు.

1/70 చట్టం జోలికి వస్తే సహించేది లేదు..



శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): 1/70 చట్టం జోలికి వస్తే ఊరుకునేది లేదని ట్రైబల్ రైట్స్ ఫోరం అధ్యక్షుడు ఇంటికుప్పల రామకృష్ణ, గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆరిక చంద్రశేఖర్ హెచ్చరించారు. కురుపాం మండల కేంద్రంలో ఆ సంఘాల నాయకులతో కలిసి 1/70 చట్టాన్ని సంరక్షించాలని బుధవారండిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ వేదికగా నిర్వహించిన పెట్టుబడిదారుల సదస్సులో ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన పాత్రుడు 1/70 చట్టంపై సడలింపులు చేయాలని చేసిన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు గుండెలా కావలి ఉన్న 1/70 చట్టం సవరణ చేయాలని ఆలోచన చేయడం దుర్మార్గమని, ఆ ఆలోచనను వెనక్కి తీసుకోకుంటే గిరిజనులంతా ఏకమై ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. గిరిజనుల పట్ల చిత్తశుద్ధి ఉంటే సీఎం చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో కురుపాంలో, డిప్యూటీ సీఎం పవన్కల్యాణ్ ఎన్నికల ప్రచారంలో పాలకొండలో ఇచ్చిన వాగ్దానాల మేరకు తక్షణమే జీఓ నంబర్ 3ను పునరుద్ధరించాలని, షెడ్యూల్డ్ ప్రాంత గిరిజనుల కోసం ప్రత్యేక డీఎస్సీ నియామకాలు చేపట్టాలని హితవు పలికారు.

1/70 జోలికి రావద్దు

గుమ్మలక్ష్మీపురం: గిరిజన ప్రాంతంలో భూమిపై సర్వ హక్కులు స్థానిక గిరిజనులకే చెందుతుందని నిర్దేశించిన 1/70 చట్టం జోలికి ఎవరూ రావద్దని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్కుమార్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈ మేరకు స్పీకర్ అయ్యన్న పాత్రుడు 1/70 చట్టం సవరించాలంటూ చేసిన వ్యాఖ్యలపై రంజిత్ కుమార్పై విధంగా స్పందించారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'



బొమ్మికలో జీడిపంటపై వివరిస్తున్న ఏఓ సింహాచల

భామిని: మండలంలోని బొమ్మిక, సతివాడ గ్రామాల్లో వ్యవసాయాధికారులు బుధవారం పొలం పొలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జించే అపరాల సాగుపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి కె. సింహాచలం సూచించారు. ప్రస్తుతం పెసర పంట పూద దశలో ఉందని, మంచి దిగుబడి కోసం 12:0:45 ఎరువును నీళ్లలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే జీడి పంటలో చేపట్టాల్సిన సస్యరక్షణపై అవగాహన కల్పించారు. ఫారం పాండ్స్లను ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్మించుకోవచ్చన్నారు. కార్యక్రమాల్లో సతివాడ సర్పంచ్ పాశర్ల రామారావు పాల్గొన్నారు.

పీహెచ్సీలో సమస్యలు పరిష్కరించాలి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని మొండెంఖల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైపు ప్రభుత్వ అధికారులు దృష్టి సారించాలని ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పూలక వాసుదేవరావు, అనిల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మొండెంఖల్లు పీహెచ్సీలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు కొంత కాలంగా భర్తీకి నోచుకోలేదని, నైట్ వాచ్మేన్ పోస్టు కూడా ఖాళీగా ఉందన్నారు. అలాగే ఆస్పత్రిలో పుట్టిన పిల్లలకు సంబంధించి జనన సర్టిఫికెట్లు మంజూరు చేసేందుకు వీలుగా ప్రింటర్ను కూడా ఆస్పత్రి వద్ద అందుబాటులోకి తేవాలన్నారు.

పై సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ..వినతిపత్రాన్ని మొండెంఖల్లు గ్రామ సచివాలయం ఉద్యోగులకు వారు అందజేశారు.

మున్సిపల్ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు



నగరపంచాయతీ స్థలంలో బోర్డు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

పాలకొండ: మున్సిపల్ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగర పంచాయతీ కమిషనర్ ఎస్. సర్వేశ్వరరావు హెచ్చరించారు. పట్టణంలో ఉన్న మున్సిపల్ స్థలాలను బుధవారం గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగర పంచాయతీకి సంబంధించిన ఖాళీ స్థలాలను కొంతమంది ఆక్రమించారని, అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

● మట్టిని తొలగించరూ..



వీరఘట్టం మండల కేంద్రంలో ఉన్న వట్టిగెడ్డ వంతెనకు ఇరువైపులా పేరుకుపోయిన మట్టిని తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఏమాత్రం అలక్ష్యంగా ఉన్నా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడక తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మట్టి తొలగించే పనులు చేపట్టాలని కోరుతున్నారు. - వీరఘట్టం